# 'నీతి ఆయోగ్'గా ప్రణాళికా సంఘం..



అరవింద్



బిబేక్



సారస్వత్

- 2015 జనవరి 1 న ప్రణాళికా సంఘం పేరు 'నీతి ఆయోగ్' గా మారింది.
- ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి, దాని స్థానంలో సరికొత్త వ్యవస్థను రూపొందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ 2014 ఆగస్టు 15 న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. కొత్త వ్యవస్థ సమకాలీన ఆర్థిక ప్రపంచానికి తగినట్లు ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రణాళికా సంఘం పేరు మార్చారు.
- 'భారత్ పరివర్తనకు జాతీయ సంస్థ' (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా - ఎన్ఐటీఐ) సంక్షిప్త రూపమే నీతి. దీనికి ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు.

## నీతి ఆయోగ్ సమగ్ర స్వరూపం:

- నీతి ఆయోగ్ అధ్యక్షుడు: ప్రధానమంత్రి
- ఒక ఉపాధ్యక్షుడు, సీఈవో ఉంటారు.
- అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు పాలకమండలిలో ఉంటారు.
- అయిదుగురు పూర్తికాల సభ్యులు, ఇద్దరు పాక్షిక కాల సభ్యులు ఉంటారు. ఈ ఇద్దరినీ ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల నుంచి తీసుకుంటారు.
- నలుగురు కేంద్ర మంత్రులు తమ పదవిరీత్యా దీనిలో సభ్యులవుతారు.
- నీతి ఆయోగ్ కింద కొన్ని ప్రాంతీయ మండళ్లు ఏర్పాటవుతాయి. కొన్ని రాష్ట్రాలు లేదా ఒక ప్రాంత నిర్దుష్ట అంశాలను ఇవి పర్యవేక్షిస్తాయి. ఆయా ప్రాంత సీఎంలు, గవర్నర్లు దీనిలో సభ్యులుగా ఉంటారు. నీతి ఆయోగ్ అధ్యక్షుడు లేదా ఆయన నియమించే వ్యక్తి ఈ మండళ్ల అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. కొందరు నిపుణులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తారు.

## లక్ష్యాలు, విధులు...

- బలమైన రాష్ట్రాలతోనే బలమైన దేశం అనే విశ్వాసానికి అనుగుణంగా కీలకమైన విధాన నిర్ణయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైన వ్యూహాత్మక, సాంకేతిక సలహాలను ఈ సంస్థ సమకూరుస్తుంది.
- ఆర్థికాంశాలతో పాటు జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలపై సూచనలు చేస్తుంది.
- గ్రామస్థాయి నుంచి విశ్వసనీయ ప్రణాళికలను రూపొందింపజేసే యంత్రాంగాన్ని తీర్చిదిద్దుతుంది. వాటి అమలు తీరును పర్యవేక్షిస్తుంది.
- ఆర్థిక పురోగతి నుంచి తగినంత లబ్ధి పొందలేకపోతున్న సామాజిక వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది.
- పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం, అందరికీ అవకాశాలు కల్పించడం, భాగస్వామ్యపాలన, సాంకేతిక వినియోగాన్ని పెంచడం లాంటివి ఈ సంస్థ లక్ష్యాల్లో ఉన్నాయి.
- 'నీతి ఆయోగ్'కు తొలి వైస్‌ఛైర్మన్‌గా భారతీయ అమెరికన్, ప్రముఖ స్వేచ్ఛా వాణిజ్య ఆర్థికవేత్త అరవింద్ పనగడియా (62 ఏళ్లు) ను ప్రధాని మోదీ 2015 జనవరి 5 న నియమించారు.
- పనగడియా అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర ఆచార్యుడు. అంతకుముందు ఆయన ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) ప్రధాన ఆర్థికవేత్తగా, యూనివర్సిటీ ఆఫ్ మేరీలాండ్‌లో అంతర్జాతీయ ఆర్థిక శాస్త్ర కేంద్రం ఆచార్యుడిగా, కో డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ)ల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి పట్టా పొందిన పనగడియా ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు.
- గుజరాత్ నమూనా అభివృద్ధికి పనగడియా గట్టి మద్దతుదారు. మరో ప్రముఖ ఆర్థికవేత్త జగదీష్ భగవతితో కలిసి ఆయన 'వైగ్రోత్ మ్యాటర్స్' సహా 15 పుస్తకాలు రాశారు. అరవింద్ రాజస్థాన్‌లోని వసుంధర రాజే ప్రభుత్వానికి సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.
- ఆర్థికవేత్త బిబేక్ దేబ్రాయ్, డీఆర్‌డీవో మాజీ అధిపతి వీకే సారస్వత్ నీతి ఆయోగ్ పూర్తికాలపు సభ్యులుగా వ్యవహరించనున్నారు.
- కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, సురేష్ ప్రభు, రాధామోహన్‌సింగ్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులయ్యారు.
- కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, స్మృతీ జుబిన్ ఇరానీ, థావర్‌చంద్ గెహ్లాట్ ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులయ్యారు.
- 'నీతి ఆయోగ్' ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈవో)గా విశ్రాంత ఐఏఎస్ అధికారిణి సింధుశ్రీ ఖుల్లార్ జనవరి 10 న నియమితులయ్యారు. ఈమె గతంలో అప్పటి ప్రణాళికా సంఘం కార్యదర్శిగా పనిచేశారు. ఈమె ఏడాదిపాటు ఈ బాధ్యతలు నిర్వహిస్తారు.
- 2015 ఫిబ్రవరి 6 న 'నీతి ఆయోగ్' తొలి సమావేశాన్ని దిల్లీలో నిర్వహించారు.
- 2015 ఫిబ్రవరి 8 న 'నీతి ఆయోగ్' పాలకమండలి తొలి సమావేశం దిల్లీలో జరిగింది. 'సబ్‌కా సాథ్... సబ్‌కా వికాస్' (అందరితో కలిసి.. అందరి వికాసం కోసం) అనే నినాదంతో కేంద్రం - రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధి ఫలాలను ప్రజలకు పంచాలని ప్రధాని పిలుపునిచ్చారు.
- నీతి ఆయోగ్ కింద ముఖ్యమంత్రులతో మూడు ఉప బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.

appscgroup.blogspot.com